క్లుప్తంగా

ఈవీఎం గోడౌన్ల పరిశీలన


ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): త్రైమాసిక తనిఖీలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. ఈవీఎం గోదాము తాళములు, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపకదళ పరికరాలు మొదలైనవి పరిశీలించారు. అనంతరం సెక్యూరిటీ లాగ్ బుక్‌లో సంతకం చేశారు. కార్యక్రములో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో అక్టోబరు 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను 2,64,966 మందికి రూ.113.24 కోట్లు పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో పెన్షన్ల పంపిణీపై అధికారులతో ఆమె సమీక్షించారు. 1వ తేదీనే నూరుశాతం పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశామని, అనివార్య కారణాలతో పింఛన్ తీసుకోనివారికి 3వ తేదీన అందిస్తారని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, ఎల్‌డీఎం డి.నీలాద్రి పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్ ఏర్పాటుకు కృషి


నల్లూరి సతీష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఆర్ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు, దాతల సహకారంతో అన్నదాన ట్రస్ట్ ఏర్పాటుకు కృషి చేస్తానని దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్ తెలిపారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా సతీష్ జిల్లాలోని రాట్నాలకుంట రాట్నాలమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా పని చేస్తూ ఇక్కడికి వచ్చారు. సోమవారం ఆలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ ఆలయంలో స్వామివారికి సంప్రదాయంగా వస్తున్న అన్ని ఉత్సవాలనూ కొనసాగిస్తామని, ప్రతి శనివారం నిర్వహించే అన్నదానాన్ని నిత్యాన్నదానంగా మార్చేందుకుగల అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. స్వామి వారికి చేయిస్తున్న బంగారు శంఖు, చక్రాలు, బంగారు పుష్పాల పూర్తికి కృషి చేస్తానని చెప్పారు. తొలుత ఆయన ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


నిత్యం నీళ్లల్లోనే వాహనల రాకపోకలు

పాతాళగంగ ఆగేదెప్పుడో!

ఏలూరు నగర ప్రజల ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించేందుకు శ్రీనివాస థియేటర్ వద్ద ఉన్న రైల్వే గేటును తీసివేసి అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించారు. దీనికి స్నేహవారధిగా నామకరణం చేసి ప్రారంభించారు. ఆ రోజు నుంచి నేటి వరకూ నిత్యం వారధిలో నీరు ఊరుతునే ఉంది. దీంతో స్నేహవారధి మొత్తం నాచుపట్టి వాహనచోదకులు తరచూ అదుపు తప్పి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఎంతో ఆధునిక సాంకేతక పరిజ్ఞానం ఉన్న ఈ కాలంలో కూడా ఈ లోబ్రిడ్జిలోని నీటి ఊటను ఆపలేకపోతున్నారు. నగరానికి ఎంతో ఉపయోగపడే లోబ్రిడ్జికి సాంకేతికతను ఉపయోగించి ఆ నీటిప్రవాహాన్ని ఆపాలంటూ ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు


నాచుపట్టి జారిపోయే ప్రదేశం


నిత్యం రద్దీగా ఉండే స్నేహవారధి


పొంగుతున్న పాతాళగంగ

హిందూ సమాజానికి చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

దెందులూరు: చంద్రబాబు, పవన్ కల్యాణ్ హిందువులకు క్షమాపణ చెప్పాలి, దెందులూరు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదమైన పవిత్రమైన లడ్డూలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కల్యాణ్ చెప్పటం బాధ్యతారాహిత్యమని వైఎస్సార్ సీపీ నాయకులు డీబీఆర్‌కే చౌదరి అన్నారు. సోమవారం దెందులూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సాక్షాత్తు తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తేడా ఉన్న నెయ్యి ట్రాక్టర్లను వెనక్కి పంపేశామని ఆ నెయ్యిని లడ్డూలో వాడలేదని చెప్పారన్నారు. టీటీడీ ఈవో చెప్పినప్పటికీ చంద్రబాబు మాత్రం ఎటువంటి ఆధారాలు లేకుండా విచారణ జరపకుండా వైఎస్సార్‌సీపీకి అంటగట్టేలా లడ్డూపై రాజకీయం చేయడం తగదన్నారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్య చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వర స్వామి భక్తులను హిందువులను కించపరచటమేనన్నారు. తక్షణమే చంద్రబాబు, పవన్ కల్యాణ్ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలన్నారు. కూటమి నాయకులు హిందూ సమాజానికి క్షమాపణ చెప్పకపోతే పార్టీ ఆదేశాల మేరకు భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని ఆయన అన్నారు.

మంచి సేవలు అందించేలా దేవుని ఆశీస్సులు


బిషప్ జయరావును కలిసిన జయప్రకాష్, నాయకులు

ఏలూరు టౌన్: ఏలూరు కథోలిక్ పీఠం బిషప్ డాక్టర్ పొలిమేర జయరావును ఏలూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. బిషప్ జయరావుకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రజలకు మంచి సేవలు అందించేలా దేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఏలూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మున్నుల జాన్‌గురునాథ్, కిలాడి దుర్గారావు, కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, మదిరి నిర్మల, జేవీఆర్ మాస్టార్, దాసరి రమేష్, జక్కుల బెనర్జీ, మట్టా రాజు, మేతర సురేష్, పెరికే వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

గిరిజనులకు భూములు కేటాయించాలని ధర్నా

బుట్టాయగూడెం: సింగరేణి సంస్థకు అప్పగించిన రిజర్వ్, అన్‌రిజర్వ్ భూములను స్థానిక గిరిజనులకే కేటాయించాలని కోరుతూ కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద సోమవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎమ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కోరండ్ల శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ రామ్మోహన్‌లు మాట్లాడుతూ 14 సంవత్సరాల క్రితం సింగరేణి సంస్థ తెలంగాణలో ఫారెస్ట్ భూములను తీసుకున్నట్టు చెప్పారు. ఆ భూములకు వంతుగా బుట్టాయగూడెం, పోలవరం మండలాల్లో ఉన్న సరిహద్దుల్లో వెయ్యి ఎకరాల అటవీ భూములను అటవీ శాఖకు కేటాయించినట్టు తెలిపారు. దీనికి ఫలితంగా ఆదివాసీ కొండరెడ్డి గిరిజన గ్రామాల అభివృద్ధికి రూ.కోటి కేటాయిస్తామని నాడు అటవీశాఖ, రెవెన్యూ అధికారులు సింగరేణి సంస్థ ద్వారా ఇప్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నేటికీ గిరిజన గ్రామాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు. ప్రస్తుతం ఆ భూములను అటవీశాఖ ఆక్రమించుకునేందుకు గిరిజనులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ధ్వజమెత్తారు. నాడు ఇచ్చిన హామీ ప్రకారం రూ.కోటి ఇచ్చేవిధంగా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని కోరారు. గిరిజన సమస్యల పరిష్కార వేదిక ప్రతి బుధవారం నిర్వహించాలని అన్నారు. అనంతరం ఐటీడీఏలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అధికారులకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కొవ్వాసి గోవింద రాజు, మడకం వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు కారం లక్ష్మి పాల్గొన్నారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకోండి

దెందులూరు: కొవ్వలి హైస్కూల్ విద్యార్థులను వేధిస్తున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని గ్రామ నాయకులు కే రామకృష్ణ సుధాకర్ కోరారు. దీనిపై సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలినికి ఆయన లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉన్నత పాఠశాలకు వెళ్లేటప్పుడు వచ్చేటప్పుడు విద్యార్థులను గ్రామంలోని కొందరు ఆకతాయిలు భరించలేని విధంగా వేధిస్తున్నారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. బీఆర్ అంబేడ్కర్ ఏలూరు విచ్చేసి 80 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెట్‌వెల్ సీఈఓ కె.ప్రభాకర్, ఆర్ఐఓ చంద్రశేఖర్, ఇరిగేషన్ డీఈఈ దేవరకొండ వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం రాంబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1944 సెప్టెంబర్ 30న ఏలూరు రావడం ఎంతో సంతోషకరమైన విషయమని, ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల నాయకులు నేతల రమేష్ బాబు, చాగంటి సంజీవ్, ఐఆర్ఎస్ ఆర్ అండ్ బీ రిటైర్డ్ డీఈఈ గరికిముక్కు వెంకటేశ్వరరావు, దాసరి నాగేంద్ర కుమార్, చొప్పల సాయిబాబు, పళ్లెం ప్రసాద్, మెండెం సంతోష్ కుమార్, మేతర అజయ్, అబ్బూరి అనీల్, దాసి వెంకటేశ్వర్లు, మేడిశెట్టి గిరిబాబు, కొత్తల పూర్ణ మల్లికార్జున్, మంచెల్ల ఇస్సాక్, ఎరికిపాటి విజయ్, కాపుదాసి రవి, గొల్ల కిరణ్, మెండెం ఆనంద్, చింతా మహాలక్ష్మణుడు, మేరుగు సత్యనారాయణ, కుర్మా రాజు, కొరబండి బాబురావు, కర్నికోటి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ శాఖలో విజిలెన్స్ సిబ్బంది మరింత క్రమశిక్షణతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారి కేవీ రామకృష్ణ ప్రసాద్ సూచించారు. సోమవారం విద్యుత్ విజిలెన్స్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.తులసీరామకృష్ణ సమక్షంలో మిగిలిన సిబ్బంది విధులను అడిగి తెలుసుకున్నారు. ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా విజిలెన్స్ సిబ్బంది పనిచేయాలని రామకృష్ణ ప్రసాద్ సూచించారు. 11 కేవీ లైన్స్ వెళ్తున్న పామాయిల్ రైతులు తప్పనిసరిగా అధికారులతో సంప్రదించి ఎల్‌సీ తీసుకున్న తరువాతే తోటల్లో పామాయిల్ గెలలు కోయించడం వంటి పనులు చేయాలన్నారు. రైతులతో సమన్వయం చేసుకుని ప్రమాద హెచ్చరికలు తెలిపే బోర్డులను ఉంచాలని అన్నారు. భవన నిర్మాణాలు జరిగే సమయంలో దగ్గరలో విద్యుత్‌తీగలు ఏమైనా ఉంటే విద్యుత్ అధికారులు, భవన నిర్మాణదారులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎరుకలు, యానాదులకు పక్కా ఇళ్లు నిర్మించాలి


గ్రీవెన్స్‌లో జిల్లా హౌసింగ్ పీడీకి వినతిపత్రం అందిస్తున్న ఝాన్సీ

ఏలూరు రూరల్ : వెనుకబడిన ఎరుకలు, యానాదులు, చెంచుకులాల పేదలకు ప్రభుత్వమే ఉచితంగా పక్కా ఇళ్లు నిర్మించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ గోసాల ఝాన్సీ కోరారు. సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. పెదపాడు, పెదవేగి మండలంలోని పలు గ్రామాల్లో ఎరుకలు, యానాదులు, చెంచులు రోడ్లు, ఖాళీ స్థలాలు, చెరువుగట్లు పక్క పూరి గుడెసల్లో దీనంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. మరుగుదొడ్లు, తాగునీరు, వైద్యం తదితర మౌలిక వసతులు లేకుండా దుర్భర జీవితం అనుభవిస్తున్నారని వివరించారు. 40 ఏళ్లగా ఎలుకలు, చేపల పట్టడం తదితర చేతి వృత్తులతో జీవనం సాగిస్తున్న వీరికి ప్రభుత్వం స్థలాలు ఇచ్చినప్పటికీ సొంతంగా ఇల్లు కట్టుకోలేని నిస్సాహయ స్థితిలో ఉన్నారని వివరించారు. కొందరు బేస్‌మెంట్ వేసుకుని, డబ్బులు లేక మధ్యలోనే ఇళ్ల నిర్మాణం నిలిపేశారన్నారు. ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా వెనకబడిన వారికి ఉచితంగా పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

ఖురాన్ కంఠస్థ ప్రతిభా పోటీలకు దరఖాస్తులు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోటీ నిర్వాహకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఖురాన్ కంఠస్థ ప్రతిభా పోటీలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ రీజినల్ కోఆర్డినేటర్ ముహమ్మద్ నయీముల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా ఏలూరు తంగెళ్లమూడి దర్గా ఇస్లామి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఈ పోటీల వాల్ పోస్టర్‌ను వారు విడుదల చేశారు. ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు పెరుగుతాయన్నారు. మతాలకు, కులాలకు అతీతంగా ఈ పోటీలో విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు గెలుపొందిన విద్యార్థులకు ఇస్తామని తెలిపారు. అక్టోబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విద్యార్థులకు డిసెంబర్ 22న ఏలూరు దర్గా ఇస్లామిక్ పాఠశాలలో క్వార్టర్ ఫైనల్స్ నిర్వహిస్తామని, పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపెంట్ సర్టిఫికెట్లు ఇస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కోఆర్డినేటర్ మహమ్మద్ ముహీబుల్లాహ్ ఫోన్ 99082 62723, షేక్ ఆదిల్ ఫోన్ 99893 80350లో సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	31
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	21

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	23
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.00	4830	29

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	52	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	68-100
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	07,10
బెండకాయలు	30	కంద	50
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	40
కాకర కాయలు	30-48	కీరా దోస	40
బీరకాయలు	54	ఫ్రెంచ్‌బీన్స్	74
బీరకాయలు (పందిరి)	44	అల్లం	80-140
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	40-54	పాలకూర	15
దొండకాయలు	40	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	12
ఉల్లిపాయలు	58	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	34-40	బఠాణీ	--
ఆనబకాయ (1)	30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	58

ప్లాస్టిక్ వాడకంతో భవిష్యత్తుకు అనర్థం


ప్లాస్టిక్ వస్తువుల వాడకం నష్టాలపై అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

దెందులూరు: ప్లాస్టిక్ వస్తువుల వాడకంలో భవిష్యత్తుకు అనర్థమని దెందులూరు ఎంపీడీవో వి శ్రీలత అన్నారు. సోమవారం దెందులూరు 10వార్డు సెంటర్‌లో దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వస్తువుల వాడకం నష్టాలపై అవగాహన కల్పించారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులు నాటక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జూట్ వస్తువులు ఎంపీడీవో శ్రీలత ఏలూరు సర్పంచ్ తోట ఏసమ్మ, వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శి వీఎస్ చౌదరి సచివాలయ ఉద్యోగులు చేతులో పట్టుకొని ప్లాస్టిక్ వస్తువులు వాడకు మారండి భవిష్యత్తులో కాపాడండి అంటూ నినాదాలు చేశారు. సర్పంచ్ తోట ఏసమ్మ మాట్లాడుతూ సమాజానికి మేలు జరిగే అంశాలపై దెందులూరు నర్సింగ్ కళాశాల చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువులను వాడవద్దని సూచించారు.

పోలీస్ అధికారులకు ఆత్మీయ వీడ్కోలు


పోలీస్ అధికారులను సత్కరించిన ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్, పోలీస్ అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో పోలీస్ శాఖలో పదవీ విరమణ చేసిన అధికారులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వారిని ఘనంగా సత్కరించారు. ఏలూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేసిన బి.నాగేశ్వరరావు, డీఏఆర్‌లో పనిచేసిన ఏఆర్ ఎస్సై కె.ఎబినెజర్, క్లూస్‌టీంలో పనిచేసిన ఎస్సై బి.రాధాకృష్ణ, ఏఆర్ హెచ్‌సీ డి.ఆనంద్‌కుమార్‌ను పోలీస్ అధికారులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్ శేఖర్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం వారు చేసిన సేవలు అభినందనీయమని తెలిపారు. అనేక వత్తిడులను అధిగమిస్తూ నిత్యం ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. శాఖాపరమైన సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ నుంచి రావాల్సిన రాయితీలు వచ్చేలా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్ నాగేశ్వరరావు, పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబాలు ఉన్నాయి.

చంద్రబాబు అసత్య ప్రచారాలు మానుకోవాలి


అప్పన ప్రసాద్

దెందులూరు: చంద్రబాబు అసత్య ప్రచారాలు, దుర్మార్గపు ఆలోచనలు ఇకనైనా మానుకోవాలని దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అప్పనప్రసాద్ అన్నారు. రాబోయే క్రిస్మస్, రంజాన్ పండుగలకు కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు డిక్లరేషన్ ఇచ్చి పాల్గొంటారా అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు కూటమి నాయకులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిక్లరేషన్ లేకుండా తిరుమల తిరుపతి దేవస్థానానికి ఎలా వెళతారని ప్రశ్నించడం అర్థరహితమని అన్నారు. ఈ సూత్రం కూటమి నాయకులకు కూడా వర్తిస్తుందని వారంతా క్రిస్మస్, రంజాన్ వేడుకల్లో పాల్గొనేందుకు చర్చిలు, మసీదుల్లోకి ప్రవేశించినప్పుడు డిక్లరేషన్ ఇవ్వాలని ప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను గమనిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు అమలు గాని హామీలు ఇచ్చి మోసపూరితంగా వ్యవహరించి అధికారం చేపట్టిన తర్వాత సూపర్ సిక్స్‌ను చూస్తే భయమేస్తోందని సీఎం చంద్రబాబు చెప్పడం వెనుక కుట్ర కోణం ఉందని అన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాలను డైవర్ట్ చేయడానికి ఏకంగా దేవుడి పేరుతో రాజకీయం చేశారన్నారు. ఒకవైపు తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిబంధనలకు అనుగుణంగా లేని నెయ్యిని వెనక్కి తిప్పి పంపేశామని విలేకరుల సమావేశంలో చెప్పారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం లడ్డూ తయారీలో కలుషిత నెయ్యి కలిపారని అసత్య ప్రచారం చేస్తూ దుర్మార్గానికి పాల్పడుతున్నారని అన్నారు. లడ్డూ పేరిట చంద్రబాబు చేస్తున్న రాజకీయం వికటించిందని, సాక్షాత్తు ఆ వేంకటేశ్వర స్వామి సుప్రీంకోర్టు రూపంలో కల్తీ జరగలేదని, ఆధారాలు లేవని చెప్పించారని అన్నారు. ఇకనైనా చంద్రబాబు, కూటమి నాయకులు దేవుడితో రాజకీయాలు చేయవద్దని అప్పన ప్రసాద్ అన్నారు.

ఏడుగురికి జరిమానా

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వాహనదారులు ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు, మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానాలు తప్పవని ఏలూరు ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈనెల 22న ఏలూరు పెద్దరైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్‌షెడ్ రోడ్డులో ట్రాఫిక్ పోలీస్ అధికారులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఏడుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో ఇద్దరు ఆటోవాలాలు కాగా, మరో ఐదుగురు మోటారు సైకిల్‌పై ప్రయాణించేవారు ఉన్నారు. వీరిపై కేసు నమోదు చేసి సోమవారం ఏలూరు ఫస్ట్ స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి ఏడుగురు వ్యక్తులకు రూ.21వేల జరిమానా విధించారు.